క్లుప్తంగా

కుళాయిల ఏర్పాటు



కుళాయిని ప్రారంభిస్తున్న ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ఆదేశాలతో మండలంలో జగనన్న కాలనీల్లో నీటి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నట్లు బుక్కపట్నం ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఆయన శనివారం మండలంలోని గశికవారిపల్లి పంచాయతీలో జగనన్న కాలనీలో కుళాయిలు ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి జగనన్న కాలనీలో సౌకర్యాలు కల్పించామన్నారు. ఇళ్లు వేగంగా నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోవిందరెడ్డి, నాయకులు చింతల్‌రెడ్డి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నకేశవా నమోనమః



సర్వభూపాల వాహనంపై స్వామివారు

ధర్మవరం అర్బన్: బ్రహ్మోత్సవాల్లో భాగంగా లక్ష్మీచెన్నకేశవస్వామి భక్తులకు సర్వభూపాల వాహనం, సింహ వాహనాలపై శనివారం దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ దాసెట్టి సుబ్రహ్మణ్యం సమక్షంలో ప్రధాన అర్చకులు కోనేరాచార్యులు, అర్చకులు మకరందబాబు, భానుప్రకాష్‌లు సర్వభూపాల వాహనం, సింహ వాహనాలను ప్రత్యేక పూలతో అలంకరించారు. ఉదయం సర్వభూపాల, సాయంత్రం సింహ వాహనంపై లక్ష్మీచెన్నకేశవస్వామి ఉత్సవమూర్తులు ఉభయదాతల సమక్షంలో కొలువుదీరగా పురవీధుల్లో ఊరేగించారు.

ప్రతి ఒక్కరికీ సచివాలయ సేవలందాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ శివారెడ్డి

పుట్టపర్తి అర్బన్: అర్హులైన ప్రతి ఒక్కరికీ సచివాలయ సేవలు అందించాలని సచివాలయ ఉద్యోగులను డీఎల్‌డీఓ శివారెడ్డి ఆదేశించారు. శనివారం పుట్టపర్తి మండలం చెర్లోపల్లి, వెంగళమ్మచెరువు గ్రామాల్లోని సచివాలయాలను ఎంపీడీఓ అశోక్‌కుమార్‌రెడ్డితో కలిసి సందర్శించారు. వారు మాట్లాడుతూ సచివాలయాల్లో ప్రభుత్వ సేవలు తెలిపే పోస్టర్లు ప్రచురించాలన్నారు. సచివాలయ రికార్డులు, అటెండెన్స్ రిజిస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్

ధర్మవరం అర్బన్: సీఎం కప్ పోటీలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక కళాశాలలో శనివారం విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మే 1 నుంచి ప్రారంభమయ్యే రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా జట్టు తరపున ప్రాతినిథ్యం వహిస్తారన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జీవన్‌కుమార్, పీడీ ఆనంద్, అధ్యాపకులు తదితరులున్నారు.

సకాలంలో బిల్లులు

కనగానపల్లి: నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం కింద ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకున్నవారికి సకాలంలో బిల్లులు మంజూరు చేయిస్తామని హౌసింగ్ శంకర్‌లాల్ తెలిపారు. శనివారం ఆయన మండలంలోని ముక్తాపురం, కనగానపల్లి, వేపకుంట గ్రామాల్లో పర్యటించి జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. హౌసింగ్ ఏఈ చిరంజీవి తదితరులున్నారు.

హాయిగా ప్రయాణం

- పుట్టపర్తికి పెరిగిన రాకపోకలు
- రద్దీకి అనుగుణంగా రైళ్లు
- ప్రయాణికులకు అనుగుణంగా నదుపాయాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



ప్రశాంతి నిలయం రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు

పుట్టపర్తి టౌన్: జిల్లాగా ఏర్పడిన తర్వాత పుట్టపర్తికి రాకపోకలు పెరిగాయి. రైళ్ల సౌకర్యాన్ని ఎక్కువ మంది వినియోగించుకుంటున్నారు. ప్రస్తుతం ప్రశాంతి నిలయం రైల్వేస్టేషన్ మీదుగా 12 రైళ్లు నడుస్తున్నాయి. కొన్ని డైలీ, కొన్ని బైవీక్లీ, మరిన్ని వీక్లీ ఉన్నాయి. ప్యాసింజర్ రైళ్లు కూడా నడుస్తున్నాయి. ప్రయాణికులకు అనుగుణంగా రైల్వే స్టేషన్‌లో మౌలిక సదుపాయాలు కల్పించడంతో అధికారులు భద్రతా సౌకర్యాలు పెంచారు.

పర్తి యాత్రలతో స్టేషన్ బిజీ..

దేశ విదేశాల నుంచి పర్తి యాత్రల పేరుతో వేలాది మంది భక్తులు సత్యసాయి బాబా మహాసమాధి దర్శనార్థం విచ్చేస్తారు. భక్తులు ప్రత్యేక రైళ్లలో రావడంతో స్టేషన్ బిజీబిజీగా మారుతుండేది. ప్రశాంతి నిలయం నుంచి రైల్వేస్టేషన్ 15 కిలోమీటర్ల దూరం ఉండడంతో ఆర్టీసీ, బస్సులు, ఆటోలతో ప్రైవేటు వాహనాలకు రద్దీ ఉండేది. దీంతో కూలీలకు, వాహన దారులకు ఉపాధి లభించేది. వీక్లీ నడిచే రైళ్లు సత్యసాయి ఆసుపత్రికి వచ్చే రోగులకు అనుకూలంగా నడుస్తాయి. అలాంటి సమయాల్లో కూడా ప్రయాణికులు సంఖ్య పెరుగుతూ ఉండేది.

జిల్లా అనంతరం మరింత రద్దీ..

గతంలో ధర్మవరం రైల్వేస్టేషన్ నుంచి భక్తులు, పర్యాటకులు పుట్టపర్తి కేంద్రానికి వచ్చేవారు. రైల్వేస్టేషన్ ఏర్పాటు నుంచి భక్తుల సంఖ్య పెరిగింది. జిల్లా ఏర్పడిన అనంతరం పుట్టపర్తికి ప్రభుత్వ కార్యాలయాలు, సిబ్బంది కేటాయించడంతో ప్రయాణికుల సంఖ్య బాగా పెరిగింది. బస్సు సౌకర్యం ఉన్నప్పటికీ ఉదయం, సాయంత్రం 500 మంది ప్రభుత్వ ఉద్యోగులు రైళ్లలో ప్రయాణిస్తున్నారు. దీంతో రైల్వే ఆదాయం మరింత పెరిగింది. రైళ్ల సమయానికి ఆర్టీసీ బస్సులు కూడా నడుపుతూ అధికారులు ఆదాయం పెంచారు.

ప్రయాణికులకు అన్ని సౌకర్యాలు



ప్రయాణికులకు స్టేషన్‌లో ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సదుపాయాలు కల్పించాం. వేచి ఉండే గదుల్లో తాగునీరు, రిజర్వేషన్ కౌంటర్, ఆధ్యాత్మిక పట్టణంలో ఉన్న పర్యాటక ప్రాంతాల మ్యాప్‌ను కూడా అందుబాటులో ఉంచాం. సమయానికి అనుగుణంగా స్టేషన్‌కు రోజు, వారాంతపు రైళ్లు నడుస్తున్నాయి. జిల్లా ఏర్పడిన అనంతరం ప్రయాణికుల సంఖ్య పెరిగింది. ప్రయాణికులకు అనుగుణంగా ఎక్స్‌ప్రెస్, లోకల్ రైళ్లు ఇంకా నడిపేందుకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం.

– సతీష్‌రెడ్డి, స్టేషన్ మేనేజర్

నిఘా పెంచుతాం



ప్రయాణికులకనుగుణంగా స్టేషన్‌లో భద్రత పెంచాం. స్టేషన్ సమీపంలో 28 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ప్రతి అంశం పరిశీస్తున్నాం. దొంగతనాలు జరగకుండా నిఘా ఉంచుతున్నాం. సౌండ్ సిస్టం ఆధారంగా ప్రచారం చేసి ప్రయాణికులను అప్రమత్తం చేస్తున్నాం. ఇబ్బందులు కలిగినప్పుడు 7022627056 నంబర్‌కు ఫోన్ చేస్తే వెంటనే స్పందిస్తాం.

– శ్రీధర్, ఆర్‌పీఎఫ్ ఎస్సై

'జగనన్నే మా భవిష్యత్తు'



గాండ్లపెంటలో ఆటో డ్రైవర్ల ప్రచారం

గాండ్లపెంట: 'జగనన్నే మా భవిష్యత్తు' అంటూ మండల కేంద్రంలో శనివారం భగత్‌సింగ్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు పవన్ కుమార్ ఆధ్వర్యంలో నాయకులు మేకల నరసింహులు, షఫీ, బాబు తదితరులు ప్రయాణికులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేసి టోల్‌ఫ్రీ నంబరుకు మిస్డ్‌కాల్ చేయించారు.

విశేష స్పందన

తాడిమర్రి: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మండలంలోని పెద్దకోట్ల గ్రామంలో సర్పంచ్ వెంకట వరద, వైఎస్సార్‌సీపీ నాయకులు పాటిల్ ప్రకాష్‌రెడ్డి, అశ్వర్థరెడ్డితో కలిసి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మురళీ మోహన్‌రెడ్డి, చౌడప్ప, బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్పీకుంట: మరికొమ్మదిన్నె పంచాయతీలో నాయకులు కార్యక్రమం నిర్వహించారు. జేసీఎస్ అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి, ఎంపీటీసీ తిమ్మారెడ్డి, వాటర్‌షెడ్ చైర్మన్ ఓబులరెడ్డి, నాయకులు తిరుమలనాయుడు, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

హామీలు వందశాతం అమలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

ఓడీ చెరువు: హామీలు వందశాతం అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఓడీ చెరువు మండలం మల్లెలవాండ్లపల్లిలో శనివారం ఎమ్మెల్యే మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ ఆదేశాలతో రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 7 నుంచి 29 వరకు నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి అనూహ్య స్పందన వచ్చిందన్నారు. 7 లక్షల మంది గృహసారథులు, వలంటీర్లు, కన్వీనర్లు కలసి ఇంటింటా చేకూరిన లబ్ధిని వివరించి ప్రజాభిప్రాయాన్ని కోరారన్నారు. వందకు వంద మార్కులు ప్రజలు వేశారన్నారు. ఏకంగా కోటి యాభై లక్షల కుటుంబాల నుంచి జగనన్నకు మద్దతు లభించిందన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు 600 అబద్ధపు హామీలతో గద్దెనెక్కి ప్రజలను మోసం చేశారన్నారు. జగనన్న ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి ప్రజామోదం పొందారని చెప్పారు. లోకేష్ యువగళం పేరుతో చేపట్టిన పాదయాత్రలో స్థానిక ఎమ్మెల్యేలపై నిరాధార ఆరోపణలు చేస్తూ తండ్రి చంద్రబాబుకే అబ్బయ్యాడని దుయ్యబట్టారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని అక్కడికక్కడే హామీలను ఇచ్చాడని, సీఎం అయ్యాక ప్రతి హామీ నెరవేర్చారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఫర్వీన్‌బాను, జెడ్పీటీసీ కుర్లి దామోదర్‌రెడ్డి, పార్టీ కన్వీనర్ రాజునాయుడు, సర్పంచు జగన్‌మోహన్ చౌదరి, ఎంపీటీసీ గణేష్‌రెడ్డి,అగ్రి అడ్వైజరీ కమిటి మండల అధ్యక్షులు లక్ష్మిరెడ్డి,మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి,మైనారిటి రాష్ట్ర కార్యదర్శి షామీర్‌బాషా, మాజీ కన్వీనర్లు శేషురెడ్డి, రామాంజినేయులు, మాజీ సర్పంచు మారెన్న,నాయకులు నాగిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, రామిరెడ్డి, నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే లక్ష్యం

ఓడీ చెరువు: ప్రజా సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యమని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఓడీ చెరువు మండలం చింతమానుపల్లి పంచాయతీ పరిధిలోని అచ్చామియాపల్లి, నాయనవారిపల్లి, కాటంరెడ్డిపల్లి, కమ్మవారిపల్లి, మల్లెమల్లోళ్లపల్లి, మల్లెలవాండ్లపల్లి గ్రామాల్లో శనివారం ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అచ్చామియా పల్లిలోని అచ్చామియా దర్గాలో ప్రత్యేక పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వచ్చే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఆశీర్వదించి అండగా నిలవాలని కోరారు. ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు.

'అది తప్పుడు కథనం'

- ఎల్లోమీడియాపై కౌన్సిల్ ఆగ్రహం



కౌన్సిల్ సమావేశ దృశ్యం



చైర్‌పర్సన్ పరికి నజీమున్నీసా

కదిరి: ఓ ఎల్లోమీడియా దినపత్రికలో మహిళా సంఘాల సొమ్ము స్వాహా చేశారంటూ కదిరి మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కొమ్ము గంగాదేవిపై వచ్చిన తప్పుడు కథనం ప్రచురించారంటూ కౌన్సిల్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ పత్రిక నిర్వాహకుడు ఒకప్పుడు విలేకరిగా పనిచేశారని, ఆయన పత్రికాధిపతి ఎలా అయ్యారని వైస్ చైర్‌పర్సన్ గంగాదేవి ప్రశ్నించారు. నిరాధార వార్తలు ప్రచురిస్తే న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ పరికి నజీమున్నీసా అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా సాగింది. అజెండా కాపీని అందజేయక పోవడంపై పాత్రికేయులు కొందరు కౌన్సిల్ దృష్టికి తీసుకురాగా, ఇకపై అలా జరగకుండా చూస్తామని సభ్యులు కొందరు చెప్పడంతో శాంతించారు. వైస్ చైర్‌పర్సన్ గంగాదేవి మాట్లాడుతూ ఎల్లోమీడియాలో వచ్చేవన్నీ తప్పుడు కథనాలేనని ప్రజలందరికీ తెలుసని అయితే ఎవరిపై వార్త రాస్తున్నారో..ఆ వ్యక్తి వివరణ కూడా తీసుకోవాలి కదా..? అని మండిపడ్డారు. నిరాధార కథనంపైనే కౌన్సిల్ తప్పుపడుతోందని కౌన్సిలర్ కిన్నెర కళ్యాణ్ అన్నారు.

వక్ఫ్ స్థలంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్దు..

కుటాగుళ్ల రైల్వే గేట్ వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, అది మైనార్టీ వక్ఫ్ బోర్డు స్థలంలో ఏర్పాటు చేయాలని తలపెట్టడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని 10వ వార్డు కౌన్సిలర్ దిల్షాదున్నీసా అన్నారు. ఆమెకు కౌన్సిలర్ షబ్బీర్ మరికొందరు మద్దతు తెలిపారు. తన వార్డులో తనకు తెలియకుండా కొందరు వలంటీర్లను తొలగించడంపై ఆమె మండిపడ్డారు. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ అద్దె గదుల టెండర్ల వ్యవహారంలో జరిగిన జాప్యంపై కౌన్సిలర్ ఎంఎస్ ఫయాజ్ కౌన్సిల్ హాల్‌లో నేలపై కూర్చొని నిరసన తెలియజేశారు. సదరు జిరాక్స్ కాపీని అందజేయడంతో ఆయన లేచి తన స్థానంలో కూర్చున్నారు. సమావేశంలో కమిషనర్ శ్రీహరిబాబు, కౌన్సిల్ సభ్యులు, పలు మున్సిపల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరామర్శ



రామచంద్రారెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

కదిరి టౌన్: గాండ్లపెంట మండలం జీనులకుంట సర్పంచ్ కె. నాగరత్నమ్మ భర్త రామచంద్రారెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి శనివారం వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

ఓడీ చెరువు: మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బొడ్డు నాగరాజు చిన్నాన్న బొడ్డు ప్రభాకర్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి శనివారం నాగరాజు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం రిటైర్డ్ ఉపాధ్యాయుడు జమాల్‌బాషు కుటుంబాన్ని పరామర్శించారు. భార్య ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకురాలు సుగుణమ్మ ఇంటికి వెళ్లి ఆమెను పరామర్శించారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



బత్తల హరిప్రసాద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నల్లచెరువు: దామవాండ్లపల్లిలో వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కోసం వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డా.బత్తల హరిప్రసాద్ రూ.లక్ష విరాళంగా శనివారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆయనను గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు బత్తల వెంకట రమణ, కదిరి రూరల్ ఎంపీపీ ఆదినారాయణ, టౌన్ అధ్యక్షుడు బావుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

గైర్హాజరైన అధికారులపై చర్యలు

ముదిగుబ్బ: మండల సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ విజయలక్ష్మిని ఎంపీపీ ఆదినారాయణ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి కొన్ని శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. ఎంపీపీ మాట్లాడుతూ సమావేశానికి అధికారులు తప్పక హాజరుకావాలని, ఆయా శాఖల ప్రగతి నివేదికలు చదివి వినిపించాల్సిన బాధ్యత అధికారులదే అన్నారు. అధికారులు గైర్హాజరైతే సమస్యలు ఎవరితో చెప్పుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రతినిధులు కూడా బాధ్యతగా ఉండాలని హితవు పలికారు. అనంతరం పలువురు అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకటరెడ్డి, బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

రూ.1.5 కోట్లతో కాంప్లెక్స్ నిర్మాణం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: 'రూ.1.5కోట్లతో నూతన మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాం. మాజీ మున్సిపల్ చైర్మన్ మాలగుండ్ల వకీలు పెద్దయ్య షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించి పట్టణాన్ని తీర్చిదిద్దుతున్నామ'ని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. పట్టణంలోని కళాజ్యోతి సర్కిల్‌లో రూ.1.5కోట్లతో గుడ్ విల్ వేలం ద్వారా నూతనంగా నిర్మించనున్న 17 గదుల మున్సిపల్ కమర్షియల్ కాంప్లెక్స్ భవన నిర్మాణానికి శనివారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి భూమిపూజ చేశారు. అనంతరం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సెంటు రూ.30 లక్షలకుపైగా ఉండే ఈ ప్రాంతంలో మున్సిపాలిటీ గుడ్‌విల్ వేలం కింద తక్కువ డబ్బుకు గదులను అందిస్తోందన్నారు. కాయగూరల మార్కెట్‌లో నిర్మించిన గదులకు సైతం ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. నూతన భవన కాంప్లెక్స్‌కు మాజీ మున్సిపల్ చైర్మన్ మాలగుండ్ల వకీలు పెద్దయ్య పేరును పెడుతున్నామని తెలిపారు. ప్రధాన వీధుల్లో మున్సిపల్ కాంప్లెక్స్‌లు నిర్మించి మున్సిపాలిటీకి ఆదాయం చేకూరుస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, మున్సిపల్ చైర్‌పర్సన్ లింగం నిర్మల, వైస్ చైర్మన్ పెనుజూరు నాగరాజు, సచివాలయాల కన్వీనర్లు చందమూరు నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దుర్గమ్మకు ప్రత్యేక పూజలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని దుర్గమ్మ ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రాకారోత్సవ రథం ఉత్సవ విగ్రహం, ముఖ తోరణముల ప్రారంభ కార్యక్రమానికి శనివారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి హాజరయ్యారు. ఆలయ కమిటీ చైర్మన్ పర్వతయ్య, ఈఓ వెంకటేషులు ఎమ్మెల్యే కేతిరెడ్డికి ఘన స్వాగతం పలికారు. అమ్మవారికి ఎమ్మెల్యే పూలహారాలు, పూజాసామగ్రి తీసుకొచ్చారు. పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక హోమంలో పూర్ణాహుతిని ఎమ్మెల్యే చేయించారు. పూజల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ లింగం నిర్మల, వైస్ చైర్మన్ పెనుజూరు నాగరాజు, ఆలయ కమిటీ డైరెక్టర్లు శాగా మురళి, గుర్రం రాధ, గుజ్జల నాగమ్మ, సాకే చౌడప్ప, రాజశేఖర్‌గుప్త, నారాయణ, దుర్గాభవాని, పూజారి రామంజినేయులుతదితరులున్నారు.

పరామర్శ

ధర్మవరం రూరల్: బత్తలపల్లి మండలం ఈదుల ముష్టూరుకుచెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్న నరసింహరెడ్డిని శనివారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పరామర్శించారు. చిన్న నరసింహరెడ్డి కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఆయన వెంట ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్య ప్రకాష్‌బాబు, మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఆమోదం



పాలకమండలి సమావేశం

ప్రశాంతి నిలయం: పుట్టపర్తి మున్సిపాలిటీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కౌన్సిల్ మీట్‌లో పలు అభివృద్ధి పనులకు సభ్యులు ఆమోదం తెలిపారు. సాయినగర్ నుంచి శ్మశాన వాటికకు వెళ్లేందుకు రూ.10 లక్షలతో రోడ్డు నిర్మాణం, సత్యమ్మ ఆలయం నుంచి సాయినగర్ కల్వర్ట్ వరకు రూ.13 లక్షలతో డ్రైన్ నిర్మాణం, స్వీపర్లకు ఈపీఎఫ్ చెల్లింపులు, చెత్త తరలించేందుకు ట్రాక్టర్లు అద్దె తీసుకునేందుకు, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్‌కు మున్సిపాలిటీ పరిధిలో 24 ఎకరాల కేటాయింపు, రూ.1.62 కోట్లతో పలు వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైయిన్ నిర్మాణాలకు పాలకమండలి ఆమోదం తెలిపింది. కార్యక్రమంలో వైస్ చైర్మన్ శ్రీ లక్ష్మి,లక్ష్మీదేవి, పవన్ కుమార్, ఈశ్వరమ్మ, పరషురామ్‌నాయక్, అనిత, ఇంజినీర్ స్వాతి,అధికారులు పాల్గొన్నారు.

రచ్చ చేసి.. తోక ముడిచి

పుట్టపర్తి మున్సిపాలిటీలో పన్ను వసూళ్లు క్షీణించి ఆదాయం తగ్గినా, అభివృద్ధి కుంటు పడకూడదన్న ఉద్దేశంతో ప్రత్యేక చొరవ తీసుకుని ఇటీవల ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ఎమ్మెల్యే కోటా నిధులు రూ.1.5 కోట్లు, 'పుడా' నుంచి రూ.1.5 కోట్లు మంజూరు చేయించారు. 3 నెలల క్రితం రూ.1.62 కోట్లతో 17 పనులకు టెండర్లు పిలిచినా, కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. రెండు నెలల క్రితం మరో మారు పిలవగా, ఎల్–1గా నిలిచిన విశ్వనాథ్ రెడ్డి పనులను దక్కించుకున్నారు. అయితే, టీడీపీ ఫ్లోర్ లీడర్ రత్నప్ప చౌదరి కమీషన్ల కోసమే పనులన్నీ విశ్వనాథరెడ్డికే కట్టబెట్టారని, అక్రమాలకు పాల్పడుతున్న కమీషనర్ జైలుకు పోతారంటూ, తాము కోర్టుకు వెళ్లి పనులను అడ్డుకుంటామని వాగ్వివాదానికి దిగాడు. స్పందించిన వైఎస్సార్ సీపీ సభ్యులు చెరువు భాస్కర్‌రెడ్డి, సూర్యాగౌడ్, సాయిగీత, తిప్పన్నలు అభివృద్ధి కోసం ప్రత్యేక చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయిస్తే ఎమ్మెల్యేని విమర్శించడం ఏంటని, చేతనైతే అక్రమాలుంటే నిరూపించాలని నిలదీయడంతో సమాధానం చెప్పలేని రత్నప్ప అక్కడి నుంచి నిష్క్రమించారు. అనంతరం అధికారులు పాలకమండలి సమావేశం కొనసాగించారు. కమిషనర్ వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ టెండర్లలో అక్రమాలు జరగలేదని, ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా పారదర్శకంగా ఖరారు చేశామని తెలిపారు.

సంక్షిప్త సమాచారం

పేకాటరాయుళ్ల అరెస్ట్

ముదిగుబ్బ: ఎస్ఎస్‌పీ కొట్టాల గ్రామ సమీపంలోని కంప చెట్లలో శనివారం పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురు పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసినట్లు పట్నం ఎస్ఐ శరత్ చంద్ర తెలిపారు. రూ.5,870తో పాటు ఆటో స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

1 నుంచి ప్రత్యేక తరగతులు

కదిరి అర్బన్: స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు మే 1 నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చెన్నకేశవ ప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. మోడల్‌స్కూల్, సోషల్ వెల్ఫేర్ కళాశాల విద్యార్థులు కూడా హాజరుకావచ్చని తెలిపారు.

కఠోర శ్రమతోనే విజయం

ప్రశాంతి నిలయం: కఠోర శ్రమ, ప్రణాళికతో ముందుకు సాగినప్పుడే విజయం సాధ్యం అవుతుందని ప్రముఖ కార్పొరేట్ సంస్థ సీసీఐ డైరెక్టర్ మంజునాథ్ పేర్కొన్నారు. శనివారం సంస్కృతీ విద్యాసంస్థలో ప్లేస్‌మెంట్ సక్సెస్ మీట్ -2023 ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మంజునాథ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విజయం సాధించాలంటే తపన ముఖ్యమన్నారు. దృఢ సంకల్పంతో ముందుకు సాగాలన్నారు. చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ 29 కార్పొరేట్ కంపెనీల్లో తమ విద్యార్థులు కొలువులు సాధించారన్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థల అకడమిక్ డీన్ డాక్టర్ బాలకోటేశ్వరి,సిబ్బంది హరికృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విజయ్‌కుమార్‌పై కేసు

కదిరి టౌన్: పట్టణంలోని టవర్‌క్లాక్ వద్ద ఉన్న సీఅండ్ఐజీ మిషన్ చర్చ్‌లో ఈనెల 19న కమిటీ సమావేశం నిర్వహించారు. ఇందులో వి.కిరణ్‌కుమార్‌కు 10వ తరగతి పేపర్ లీకేజీపై సస్పెండ్ అయిన విజయ్‌కుమార్‌కు వాగ్వాదం జరిగింది. కిరణ్‌కుమార్‌పై విజయ్ కుమార్, సుధాకర్, టీఎమ్.శిరీష, టీఎమ్ సునీల్‌కుమార్, సల్మాన్ రాజు కలిసి దాడి చేశారు. కిరణ్‌కుమార్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ మధు తెలిపారు.

'ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలి'

పుట్టపర్తి అర్బన్: ముదిగుబ్బ నుంచి కోడూరు వరకూ ఏర్పాటు కానున్న 342 జాతీయ రహదారి కోసం భూములతో పాటు ఇళ్లు కోల్పోతున్న తమకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద పరిహారం ఇవ్వాలని శనివారం బుక్కపట్నం మండలం బుచ్చయ్యగారిపల్లి గ్రామస్తులు సుమారు 50 మంది జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్‌ను కలిసి విన్నవించారు.

పండ్లతోటల సాగుకు దరఖాస్తులు..

నల్లమాడ: చిన్న, సన్నకారు రైతులు ఉపాధి హామీ పథకం కింద పండ్లతోటల సాగుకు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఓ సూర్యనారాయణ తెలిపారు. పండ్లతోటలతో పాటు అర ఎకరం వరకు రోజా, మల్లెపూల సాగుకు అనుమతి ఉంటుందన్నారు. దరఖాస్తుతో పాటు జాబ్‌కార్డు, రేషన్‌కార్డు, రేషన్‌కార్డులోని సభ్యులందరి ఆధార్‌కార్డులు, ఒరిజినల్ వన్‌బీ అడంగల్, చిన్న,సన్నకారు రైతు సర్టిఫికెట్, పట్టాదారు పాసుపుస్తకం, రైతు బ్యాంక్ ఖాతా పుస్తకం నకళ్లు తీసుకురావాలన్నారు.

భగవద్గీత పుస్తకాల పంపిణీ

తనకల్లు: మండల పరిధిలోని ఈతోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాచువారిపల్లికి చెందిన దేశాయి నాగభూషణరెడ్డి ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. దేశాయి రాకేష్‌రెడ్డి, వినోద్‌కుమార్, సమరసింహారెడ్డి పాల్గొన్నారు.

కూల్ డ్రింక్ షాపులో చోరీ

తనకల్లు: కొక్కంటిక్రాస్‌లో ఉన్న ఓ కూల్ డ్రింక్ షాపులో చోరీ జరిగింది. తమిళనాడుకు చెందిన జగదీషన్ కూల్ డ్రింక్ షాప్ నిర్వహిస్తున్నాడు. శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు షాపు రేకులను తొలగించి లోపల ఉన్న రూ. 20 వేలు విలువైన పానీయాలను తయారు చేసే మిషన్‌తో పాటు కొంత నగదును దొంగలించారు.

కలసికట్టుగా అభివృద్ధి చేసుకుందాం

రామగిరి: కలసికట్టుగా గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని తహసీల్దార్ నారాయణ స్వామి, ఎంపీడీఓ ఆజాద్ పేర్కొన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ కవ్రెన్న ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగార్జున, అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు ఉన్నారు.